క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

చాపాడు : స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ రవిశంకర్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం అనేక రకాలైన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం గౌస్‌మోద్దీన్, ఐఈఆర్టీలు గంగాదేవి, ప్రేమకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం చెప్పండి

ప్రొద్దుటూరు క్రైం : రాత్రి సమయాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు రైల్వేస్టేషన్‌లో దిగి ఆటోల్లో ప్రయాణం చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని త్రీ టౌన్ సీఐ వెంకటరమణ తెలిపారు. ప్రొద్దుటూరు శివారులోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆటో డ్రైవర్లతో రాత్రి సీఐ మాట్లాడారు. రైలు దిగి పట్టణంలోకి వెళ్లడానికి ఆటో ఎక్కిన వారిలో అనుమానాస్పద, అనుమానం కలిగించే వ్యక్తులు ఉంటే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రైల్వేస్టేషన్ నుంచి అర్ధరాత్రి సమయంలో ఆటోల్లో ప్రయాణించే స్త్రీలను జాగ్రత్తగా ఇళ్లకు చేర్చాలన్నారు. ఆటో డ్రైవర్లు తప్పకుండా యూనిఫాం ధరించాలని సీఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడుకు చెందిన సాయిగారి వెంకటనాయుడు అక్రమంగా అమ్ముతున్న 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం ఎస్ఐ రాజగోపాల్ తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధి

బద్వేలు అర్బన్ : ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తుల పంపిణీ చేశారు. నందిపల్లెలోని అవర్ లేడీ ఆఫ్ వేలాంగిణి మాత చర్చిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 130 మంది వృద్ధులకు క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో రెవ. ఫాదర్ బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్



కేసుల పరిష్కారంపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తులు

కడప అర్బన్: జిల్లాలో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో వున్న కేసుల్లో రాజీ కాదగిన కేసులను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయ సేవాసదన్‌లో పోలీసులు, న్యాయవాదులు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు న్యాయమూర్తులచేత క్రిమినల్ కేసుల్లో పరిష్కరించదగిన వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కడప ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ జె. హేమస్రవంతి, ఫస్ట్ ఏడీఎం జె. నందిని, సెకండ్ ఏడీఎం కె. భార్గవి, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, సీఐలు, ఎస్ఐలు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించాలి



ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



రాజుపాళెం : వెలవలిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి పుస్తకాలను విడుదల చేస్తున్న కుడా చైర్మన్ గురుమోహన్



పోరుమామిళ్ల: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 18వ వార్డులో 20వ సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎల్లాల మహ్మద్ గౌస్, మాజీ కౌన్సిలర్ రఫీక్, కౌన్సిలర్లు జిలాన్, కమాల్, సత్యం, ఇర్ఫాన్ బాషా, నూకా నాగేంద్రరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాజుపాళెం : రాష్ట్రంలో రెండోసారి జగనన్న సీఎం అయితే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రస్తుతం అందుతున్న మాదిరిగానే సంక్షేమ పథకాలు అందుతాయని మండల ఇన్‌చార్జి ఎంపీపీ వెలవలి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం రాజుపాళెం మండలంలోని వెలవలి గ్రామంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని తొండలదిన్నెకు వెళ్లే రహదారిలో వైఎస్సార్‌సీపీ జెండాను నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ-2 సుబ్బలక్షుమ్మ, పార్టీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, సర్పంచ్ మహబూబ్‌బాషా ఎగురవేశారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల సూచిక బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల పాలనలో వెలవలి గ్రామానికి రూ.30,29,35,095 లబ్ధి చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివనాగిరెడ్డి, సచివాలయాల కన్వీనర్ శేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండారెడ్డి, ఖాదర్, మదార్‌వల్లి, పాపా, రంతు, షరీఫ్, ఈబాషా, ఈఓపీఆర్డీ షాకీర్‌ఆలీఖాన్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చారు.. అండగా నిలుద్దాం

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని, అటువంటి సంక్షేమ సారథికి అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగసాని గురుమోహన్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కోటవీధి సచివాలయం పరిధిలో శుక్రవారం ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయం పరిధిలో ప్రజలకు జరిగిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. అనంతరం సచివాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2014లో 600 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయక ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జం రాజేశ్వరి, వార్డు ఇన్‌చార్జిలు బిజ్జం రమణ, అనిల్, మున్సిపల్ డీఈ సుమన్‌రెడ్డి, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్ రావాల్సిందే

పోరుమామిళ్ల : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలన్నా, అన్ని వర్గాలకు న్యాయం జరగాలన్నా ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాల్సిందేనని ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం చిన్న యరసాల సచివాలయం వద్ద నిర్వహించిన రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు మాట్లాడారు. మొట్టమొదటిసారి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. వలంటీర్లకు కిట్స్ పంపిణీ చేశారు. సంక్షేమ బోర్డు ఆవిష్కరించి, జెండాను ఎగురవేశారు. సచివాలయాల కన్వీనర్ కె.రమణారెడ్డి, కన్వీనర్లు మాల్యాద్రి, రామిరెడ్డి, రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోటి దీపోత్సవం

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసం నాల్గవ శనివారం సందర్భంగా సాయంత్రం సంధ్యా సమయంలో స్వామి వారి ఆలయంలో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తెలిపారు. వేకువజాము నుంచి ఆలయంలో అభిషేకం, పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని, కాయాకర్పూరం సమర్పించి స్వామి వారి కృప, కరుణాకటాక్షాలు పొందాలని కోరారు.

రేపు నగరేశ్వరునికి రుద్రాభిషేకం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఉద్యానవనంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నగరేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షకార్యదర్శులు బుశెట్టి రాంమోహనరావు, మురికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అమ్మవారికి అష్టోత్తరశత నామావళి 102 మంది సుహాసినులతో నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

నూతన నియామకం

ప్రొద్దుటూరు : బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడుగా ప్రొద్దుటూరుకు చెందిన ఇటుకల నరసింహ ప్రకాశ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులతోపాటు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తజన సందోహం నడుమ ప్రతిష్టాపనోత్సవాలు



ధ్వజస్తంభ ప్రతిష్టను తిలకిస్తున్న భక్తులు

పోరుమామిళ్ల : మండల కేంద్రంలోని చెరువుకట్టపై శ్రీ గణపతి, కాలభైరవస్వామి, సుబ్రమణ్యేశ్వర, నంది, అక్కదేవత, నాగదేవతలు, ధ్వజప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం జయప్రదంగా జరిగాయి. ప్రతిష్టాపనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగిన ప్రతిష్ట కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శివరామానంద సరస్వతి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ప్రెసిడెంట్ కె. రమణారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, కో-ఆప్షన్ మెంబర్ అల్లా, సర్పంచ్ సుధాకర్, ఉప సర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్, మాజీ ఉప సర్పంచ్ నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రచయిత బొల్లు రామ్మోహన్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ప్రజలకు రాయల సేవా సమితి వారు చెరువుకట్టకు బస్సు సౌకర్యంతోపాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమకుమారి

దువ్వూరు : మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ రమకుమారి, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో మైదుకూరు కోర్టులో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లోక్ అదాలత్ నిర్వహిస్తారని తెలిపారు. రాజీకాదగిన సివిల్, క్రిమినల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అలీఖాన్, ఆర్ఐ జాన్సన్, వీఆర్ఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా విద్యాధికారి రాఘవరెడ్డి

చాపాడు : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా విద్యాధికారి రాఘవరెడ్డి తెలిపారు. స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక క్రీడా సమ్మేళన వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా హాజరైన జిల్లా విద్యాధికారి రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు శరీరానికి రక్తం ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి వారు ఎంచుకున్న క్రీడలలో పాల్గోనాలని సూచించారు. సీబీఐటీ కరస్పాండెంటు వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో పాల్గొనటం వలన శారీకంగా మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. క్రీడలపై దృష్టి పెట్టడం వలన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఐడీపీఎస్ డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీంధ్ర, సీబీఐటీ కరస్పాండెంటు జి.శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె



మున్సిపల్ కమిషనర్ రంగస్వామికి సమ్మె నోటీసు ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మైదుకూరు : పలు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఈనెల 27న నుంచి సమ్మె చేస్తున్నట్లు ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రంగస్వామికి సమ్మె నోటీసు అందించినట్లు వారు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, అంత వరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ, పార్కు వర్కర్లకు, స్వీపర్లకు, డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, నాయకులు పి.శ్రీరాములు, ఏవీ శివరాం, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రొద్దుటూరు : విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నార్త్ సెక్షన్ ఏఈ బి.ప్రియదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ కారణంగా వైఎంఆర్ కాలనీ, బొల్లవరం, బుద్దాయపల్లె, హౌసింగ్ బోర్డు, భగత్‌సింగ్‌కాలనీ, ఆచార్లకాలనీ, ద్వారకానగర్, శ్రీనివాసపురం, కొర్రపాడు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

మైదుకూరు : పట్టణం, మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో 5 గంటల పాటు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రామభద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరులోని 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల పనుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ, రూరల్ ప్రాంతాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గోపవరం : బద్వేలు, గోపవరం మండలాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ చిన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132/33 కె.వి. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, గృహ వినియోగదారులు, రైతులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సుగల నిరుద్యోగ మహిళలు ఈ శిక్షణకు అర్హులన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎంఐజీ ప్లాట్లను సద్వినియోగం చేసుకోండి



ప్లాట్ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మధ్య తరగతి ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఎంఐజీ ప్లాట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌కు సంబంధించి లక్కీడిప్ తీసి ప్లాట్లను ఎంపిక చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు స్థలాల కంటే జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందన్నారు. సెంటు రూ.5లక్షలతో అన్ని సౌకర్యాలు కల్పించి జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌ను నిర్మిస్తున్నారన్నారు. 40 అడుగుల విశాలమైన రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి సిస్టం నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ టౌన్ షిప్‌కు సంబంధించిన అభివృద్ధి పనులకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని చెప్పారు. తొలి విడతగా మొత్తం 484 ప్లాట్లలో ఇప్పటి వరకు 202 మంది ప్లాట్లు కొనుగోలు చేయడంతో ప్రస్తుతం డిప్ తీశారని తెలిపారు. కుడా వైస్ చైర్మన్ ఓబులేసు నందన్ మాట్లాడుతూ వ్యాపార కేంద్రమైన ప్రొద్దుటూరు ప్రాంతంలో ప్రజలకు ఇది గొప్ప అవకాశమని తెలిపారు. మిగిలిన ప్లాట్లను మధ్య తరగతి వారు కొనుగోలు చేయవచ్చునని, మళ్లీ వీటికి లక్కీ డిప్ తీస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కుడా పీఓ శైలజ, ఏపీఓ కృష్ణ సింగ్ పాల్గొన్నారు.

జ్యోతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న బండారు సూర్యనారాయణ

ప్రొద్దుటూరు కల్చరల్ : తొగటవీరక్షత్రియుల కుల దైవం అయిన శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పేర్కొన్నారు. తొగటవీరక్షత్రియ కళ్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జ్యోతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని అన్ని చౌడేశ్వరిదేవి ఆలయాల నిర్వాహకులు ఆదివారం అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు అలంకరణ, మధ్యాహ్నం బిందెసేవ చేస్తారన్నారు. అర్ధరాత్రి అమ్మవారి గ్రామోత్సవం, జ్యోతి ఉత్సవాలు ప్రారంభమై సోమవారం తెల్లవారుజాము వరకు నిర్వహిస్తారన్నారు. ఈ ఏడాది దాదాపు 150 దాకా జ్యోతులు చేస్తున్నారన్నారు. రామేశ్వరం మోరీల వద్ద ఉన్న చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద సోమవారం రాత్రి చౌడేశ్వరి నాట్యకళామండలి ఆధ్వర్యంలో నాటక అకాడమి డైరెక్టర్ బండారు లక్ష్మీదేవి సహకారంతో సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. కళ్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘురామయ్య, గంజికుంట ఆంజనేయులు, శ్రీరాంనగర్ చౌడేశ్వరిదేవి ఆలయ అధ్యక్షుడు మోతుకూరి సుబ్బయ్య, రామయ్య, చౌడయ్య, చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దేవదేవుడి కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణ వేడుక సందర్భంగా గోవింద నామస్మరణ చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ గోవిందమాల భక్తబృంద సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, అనంతరం తోమాల సేవ, అర్చనలు నిర్వహించారు. 9 గంటల నుంచి కల్యాణోత్సవం ప్రారంభమైంది.

ముగ్ధమనోహరం..

కల్యాణ ఘట్టంలో భాగంగా కుడివైపున నూతన వరుడిగా శ్రీవారిని, ఎడమవైపు ఉభయదేవేరులైన శ్రీదేవి, భూదేవి మాతలను వధువులుగా అలంకరించి కొలువుదీర్చారు. వేద పండితులు కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. పుణ్యాహవాచనం, కలశ ప్రతిష్ఠ, గణపతిపూజ, ప్రవరలు, యజ్ఞోపవీత ధారణల అనంతరం సంప్రదాయంగా కన్యాదానం చేశారు. మహామంగళ సూత్రాలను భక్తులందరికీ దర్శింపజేశారు. అనంతరం మంగళ వాయిద్యాల సుస్వరాలు, వేదమంత్రోచ్చాటనల మధ్య కల్యాణ వేడుక నిర్వహించారు. భక్తులందరికీ మంగళాక్షతలను కల్యాణ ప్రసాదంగా అందజేశారు. హాజరైన వారందరికీ వివాహ భోజనం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో కడప నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో సందడిగా గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రముఖుల హాజరు..

కల్యాణోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు, టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ్యలు హాజరయ్యారు. నిర్వాహకులు వారిచే పూజలు నిర్వహింపజేశారు. వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కల్యాణోత్సవంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మేయర్ సురేష్‌బాబు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేశాను

– ఆర్ఓబీకి భూమి పూజ

– భూమి పూజలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఆర్ఓబీకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పట్టణ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేశానని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణ ప్రజల దశాబ్దాల కోరిక రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ)కి స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి భూమి పూజ చేసి మాట్లాడారు. తాను గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలనీ నెరవేర్చానన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రజల దశాబ్దాల కోరిక మరో ఏడాది కాలంలో నెరవేరబోతుందని సంతోషం వ్యక్తం చేశారు. రూ.39 కోట్లు ఆర్ఓబీ నిర్మాణానికి, మరో రూ.32 కోట్లు భూ బాధితులకు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మొత్తం రూ.72 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్ట్ పూర్తి అవుతుందన్నారు. కేంద్ర రోడ్ల శాఖా మంత్రి నితిన్ గడ్కరి రాష్ట్ర పర్యటనకు వచ్చిన సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 30 ఆర్ఓబీలు మంజూరు చేయాలని కోరారన్నారు. గడ్కరి ఫస్ట్ ఫేజ్‌లో 8, సెకండ్ ఫేజ్‌లో 12 ఆర్ఓబీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, అయితే ఫస్ట్ ఫేజ్‌లో మంజూరై భూమి పూజ చేసుకుంటున్న ఫస్ట్ ఆర్ఓబీ మనదేనన్నారు. ఆర్ఓబీ భూ బాధితులకు త్వరలోనే ఫైనాన్స్ క్లియర్ అవుతుందన్నారు. ఏడాదిన్నర కాలంలో ఆర్ఓబీ నిర్మించాలనే నిబంధనలు ఉన్నప్పటికి ఏడాదిలోపే ఆర్ఓబీ నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు చెప్పడం హర్షణీయం అన్నారు. అయితే నిర్మాణంలో నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. వందల సంవత్సరాలు ఈ బ్రిడ్జి మనుగడలో ఉండేలా మంచి నాణ్యతతో పాటు బ్రిడ్జికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు, డ్రైనేజ్ తప్పనిసరిగా నిర్మించాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. ఇప్పటికే కమలాపురం పట్టణంలో వందల కోట్ల అభివృద్ధి పనులు చేశామని, కొన్ని పూర్తి అయ్యాయని, మరికొన్ని త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. అలాగే త్వరలో పాగేరు వంక పై వంతెన, బైపాస్ రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ చేస్తామన్నారు. కమలాపురంకు ఇన్ని నిధులు మంజూరు చేసిన సీఎం జగనన్నను కమలాపురం ప్రజలు మరో సారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పరిశ్రమల, ఉద్యాన శాఖ రాష్ట్ర సలహాదారులు రాజోలి వీరారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఇతర నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, హిదాయత్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' నిర్వహణలో పారదర్శకత

కడప స్పోర్ట్స్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహణలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని కడప నగరపాలక టీపీఆర్ఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కడప నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర' టోర్నమెంట్‌కు సంబంధించి వార్డు వలంటీర్లకు అంపైరింగ్, టోర్నమెంట్ నిర్వహణ, మొబైల్ లైవ్‌స్కోరింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఎస్‌డీఓ ఎస్.వి.పి. అమృత్ రాజ్ మాట్లాడుతూ ఐదుక్రీడాంశాల్లో నిర్వహించే ఈ మెగా టోర్నమెంట్ తొలుత సచివాలయస్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు ఎం. ప్రవీణ్‌కిరణ్, ఎజాస్‌అహ్మద్‌లు మాట్లాడుతూ మ్యాచ్‌ల నిర్వహణ, లైవ్‌స్కోరును ఏ విధంగా మొబైల్‌లో అప్‌లోడ్ చేయాలి అన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు.